సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచాలి



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రాంచందర్‌రావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు కోరారు. ఈ సందర్భంగా అఖిల భారత పెన్షన్ అసోసియేషన్ ఉద్యోగుల కన్వీనర్ పీకే సింగ్ రాథోర్‌తో కలిసి రెండు వినతి పత్రాలను అందజేశారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి త్వరలో సంబంధిత అధికారులతో చర్చిస్తానన్నారు. పెన్షన్ పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మేడూరి విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మోతీనగర్: బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు మొహమ్మద్ అహ్మద్ గౌతమ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా బుధవారం మొహమ్మద్ అహ్మద్ గౌతమ్‌ను పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా వడ్డేపల్లి నర్సింగ్‌రావు జయంతి



వివేకానందనగర్‌లో వడ్డేపల్లి నర్సింగ్‌రావు విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, అభిమానులు

ఆల్విన్‌కాలనీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ వడ్డేపల్లి నర్సింగ్‌రావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివేకానందనగర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని వడ్డేపల్లి నర్సింగ్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఉన్న తాండ్రపాపారాయుడు సర్కిల్, అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న వీఎస్ఆర్ విగ్రహాలకు ఆయన కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్సనపల్లి సూర్యారావు విచ్చేసి కేక్ కట్‌చేశారు.

బిల్డర్ల సమస్యలను పరిష్కరించండి



ప్రభుత్వ సలహాదారుడికి వినతిపత్రం అందజేస్తున్న బిల్డర్లు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని బుధవారం బిల్డర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేక విజయసాయి, శ్రీధర్‌రెడ్డి, కిరణ్, లయన్ డా.కిరణ్, కాశీప్రసాద్, ఆర్‌వీరావు, సుదర్శన్‌రెడ్డి, డా. సత్యం శ్రీరంగం, నేరేడ్కో ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ సంఘటనపై చర్యలు తీసుకోవాలి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ సుల్తాన్‌పూర్ కళాశాలలో జరిగిన వ్యవహారాన్ని జేఎన్‌టీయూహెచ్ అధికారులు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించినా పరిస్థితిని చక్కదిద్దలేకపోయారని జేఎన్‌టీయూ జేఏసీ నేతలు అన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్ మాట్లాడుతూ... వారం రోజులుగా ఆహారం విషయంలో తరచూ ఆందోళనలు చేస్తున్నా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ నిబంధనలు పాటించని వారికి లైసెన్సులను వెంటనే రద్దు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని రిజిస్ట్రార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తా

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- అల్లాపూర్ డివిజన్‌లోని కాలనీల్లో పర్యటన
- నున్నంచెరువు, పార్కు అభివృద్ధి పనుల పర్యవేక్షణ





పార్కులో పర్యటించి స్థానికుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం డివిజన్‌లోని కాలనీల్లో కార్పొరేటర్ సబిహా బేగం, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన రాక్‌గార్డెన్ నున్నం చెరువు, పార్కు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పార్కులో వసతులు కల్పించాలని వాకర్స్ కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు నిధులు మంజూరు చేస్తామని తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

తులసీనగర్‌లో నీటి ఎద్దడిని పరిష్కరించండి...

స్థానికుల పిలుపు మేరకు తులసీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి సమస్యలను తీసుకొచ్చారు. అనంతరం వినతిపత్రాలు స్వీకరించారు. రెండు నెలలుగా నీటి ఎద్దడితో బాధపడుతున్నారని, వీధి దీపాలు వెలగటం లేదని, బస్తీలో ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ వేయాలని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రమాదకరంగా ఉందని, విద్యుత్ స్తంభాలను మార్చాలని, దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారానికి ఒకసారి ఫాగింగ్ చేయాలని, వీధులను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి హామీ..

అంగన్‌వాడీలో ఆయాను నియమించి బస్తీలో రాత్రిపూట పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరారు. సీసీ కెమెరాల నిర్వహణకు పోలీసులు బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, అధికారులు ఈఈ సత్యనారాయణ, ఏఈ రంజిత్, డీజీఎం రవి, లైన్‌మెన్ మొగులయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బలరాం, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, సంజీవ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, సత్యమ్మ, లక్ష్మి, ఎస్. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీని ప్రకటించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో షకీల్ అహ్మద్ ప్రొఫెసర్ కనీజ్‌జెహ్రా పర్యవేక్షణలో 'ఇ–గవర్నెన్స్ ఈజ్ టూల్ ఫర్ గుడ్ గవర్నెన్స్: ఏ స్టడీ ఆఫ్ ఖిద్మత్ సెంటర్స్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పూంచ్ ఆఫ్ జమ్మూకశ్మీర్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

నేడు పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారు. 'పవర్ వితిన్ ది లీడర్‌షిప్ లెగసీ ఆఫ్ నరేంద్రమోడీ' పేరిట రచయిత, పబ్లిక్ పాలసీ అడ్వకేట్, లీడర్‌షిప్ ట్రైనర్ బాల సుబ్రహ్మణ్యం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ ఎం పిల్లుట్ల పాల్గొంటారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలోని పార్కు ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

వీలైనంత త్వరగా యూజీడీ పనులు పూర్తి చేయాలి



కబీర్‌నగర్ బస్తీలో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: మూసాపేట డివిజన్‌కబీర్‌నగర్ బస్తీలో రూ.8లక్షల వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పనులను బుధవారం కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ సమస్య పునరావృతం కావటంతో నూతన డ్రైనేజీ లైన్ వేయించాలని నిర్ణయించామని తెలిపారు. ఇక్కడ బస్తీవాసులకు డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలనే ఉద్దేశంతో పనులు త్వరగా ప్రారంభించామన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. యూజీడీ పైపులైను వేసే ప్రాంతంలో అక్కడ ఉండే బస్తీవాసులు ఏమైనా సమస్య ఉంటే ముందే బాగు చేయించుకొని కొత్త లైన్‌కు కలుపుకోవాలని సూచించారు. అదే విధంగా కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ మేనేజర్ ప్రకాష్, ఏఈ శివ, బస్తీ అధ్యక్షుడు జోసఫ్, బీజేపీ నాయకులు మల్లేష్‌గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి, భాస్కర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం

హఫీజ్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో వనమహోత్సవం కార్యక్రమంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ పూజిత గౌడ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ముఖ్యమని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ యూబీడీ సిబ్బంది, ఆర్టీసీ కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

నేను ఆటోవాణ్ణి.. తాపీమేస్త్రీని కాదు!





మరమ్మతులు మరిచిన అధికారులు... అధికారుల డ్యూటీ చేసిన ఆటో డ్రైవర్ భరత్‌నగర్‌కాలనీ ఎల్‌ఐజీలో డ్రైనేజీ లైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. పిల్లలు ఆడుకుంటూ కింద పడేవారు. ఫిర్యాదులు చేసి నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించలేదు. విసుగు చెందిన ఆటో డ్రైవర్ నగేష్ బుధవారం సిమెంట్, ఇసుక, రాళ్లు తీసుకొచ్చాడు. తన భార్య ఆ మిశ్రమాన్ని కలిపి ఇస్తే నగేష్ తవ్విన రోడ్డును పూడ్చివేశాడు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే చేసేది లేక తానే గుంతను పూడ్చాల్సి వచ్చిందని ఆటో డ్రైవర్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన గుంతలను వెంటనే పూడ్చాలని కోరారు.

– మూసాపేట

కమ్యూనిటీహాల్ భవనం పరిశీలన

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీ పురంలోని బస్తీదవాఖానాపై నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని కార్పొరేటర్ సతీష్‌గౌడ్, ఏఈ పవన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకే హాలో ఉర్దూ, తెలుగు మీడియం ఉండటం వల్ల విద్యార్థులకు చదువుకోవడానికి ఇబ్బంది కలుగుతోందని పై అంతస్తును నిర్మించారు. ఇప్పుడు ఉర్దూ, తెలుగు మీడియం విద్యార్థులకు విడిగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా ఇక్కడ కొనసాగే బస్తీ దవాఖానాకు రోజు 100మంది వస్తుంటారని పేర్కొన్నారు. వారికి కూడా ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గౌస్, షౌకత్, ఇమ్రాన్, సలీం, అన్వర్, ఖైసర్, అస్మత్, సంతోష్‌లు పాల్గొన్నారు.

చేపల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి

సాక్షి,మేడ్చల్ జిల్లా : చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలను ఆవిష్కరించేందుకు ప్రతి ఏటా (జూలై 10న) మత్స్య కృషి వలుల జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌సీఎస్ జిల్లా చైర్మన్ మన్నె రాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. చేప పిల్లల ఉత్పత్తికి విశేష కృషి చేసిన హిరాలాల్ చౌదరి, అలీఖుని జ్ఞాపకార్థంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని చైర్మన్ పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమా మాట్లాడుతూ.. చేపల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సంబంధిత రైతులు, మత్స్యకారులకు ఆమె పిలుపునిచ్చారు. చేపల పెంపకంతో పాటు మార్కెటింగ్ వసతులు తదితర విషయాలపై సంబంధిత చేపల రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారన్నారు. డీఎఫ్‌సీఎస్ సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

మియాపూర్: మైనార్టీ గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అన్నారు. మియాపూర్ డివిజన్‌లో మయూరినగర్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ హఫీజ్‌పేట సెక్షన్ మేనేజర్ పూర్ణేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో గోకుల్ ప్లాట్స్‌లో ఉన్న మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో 400 మంది పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారు. హాస్టల్‌కు సరఫరా అవుతున్న నీరు సరిపోక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కాలకృత్యాలకు కూడా నీరు సరిపోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రోజు నాలుగు ట్యాంకర్ల మంచినీటిని పంపించాలని కోరగా ఆమె సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దశరథ్, యండి.సుల్తానా బేగం, ఇస్లావత్ దశరథ్ నాయక్, లావణ్య పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

కార్మిక కోరికల రోజు సందర్భంగా నిరసనలు తెలిపిన కార్మిక సంఘాలు





డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, మోతీనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ కార్మికులు

కూకట్‌పల్లి: దేశవ్యాప్తంగా కార్మిక కోరికల రోజును పాటించాలని సీఐటీయూ కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి సీఐటీయూ మండల కార్యదర్శి కె. కృష్ణానాయక్, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.శంకర్ మాట్లాడుతూ... పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. కార్మికులకు కనీస హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా హామీలు అమలు చేయటం లేదని విమర్శించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఐటీ అధిపతులతో అనేక మార్లు చర్చలు జరిపినా కార్మిక విభాగాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై త్వరలో ఉద్యమం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. కూలి డబ్బులు పెంచాలని, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలన్నారు. రవాణా రంగ కార్మికులకు నెలకు రూ.4500 ఇవ్వాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లి బస్‌స్టాప్ బీసీ డబ్ల్యూ ఆటోస్టాండ్, ట్రాన్స్‌పోర్టు రంగం జేఎన్‌టీయూ వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బి. రాములు, నరసింహ, సుభాష్, భారతి, మహేష్‌రెడ్డి, ప్రభుదాస్, జమీల్, సుభాష్‌రెడ్డి, నరసింహ, రమేష్, రాములు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేస్తోంది...

బాలానగర్ క్రాస్ రోడ్డు వద్ద కార్మికుల కోరికల దినం సందర్భంగా సీఐటీయూ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేస్తోందన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాలు రూ.18వేలు అందించేలా చట్టం చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. ఆశావర్కర్లకు పరీక్షలు రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం ఐకేపీ, వీఓఏ, వైద్య ఆరోగ్య రంగాలతో పాటు స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సబియా, అనిత, పుష్ప, విజయ, మంజుల, రుక్మిణీ, సమాసిని, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన...

పలు డిమాండ్‌లు తెలిపిన సీఐటీయూ నాయకులు

మోతీనగర్: కార్మికుల కోరికల దినం సందర్భంగా మోతీనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. బీఓసీడబ్ల్యూ కార్డు నమోదు, రెన్యూవల్, క్లైయిమ్స్ కోసం లేబర్ ఆఫీసులో మీసేవ తెరవాలన్నారు. బాలింతలు, వివాహం అయిన ఆడపిల్లలు మీసేవలో వేలిముద్ర పెట్టాలనే రూల్ రద్దు చేయాలన్నారు. బీఓసీడబ్ల్యూ కార్డుకు ఆధార్ లింకు, రెన్యూవల్‌కు అనేక దశల్లో అధికారులు కాకుండా ఏఎల్‌ఓలే చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ సెస్ వసూలును సంవత్సరానికి ఒక నెల మాత్రమే కాకుండా నిరంతరం చేయాలని కోరారు. బోర్డు నుంచి దారి మళ్లించిన సెస్ నిధులు వేల కోట్లు తిరిగి బోర్డులో జమ చేయాలన్నారు. బోర్డు సలహా మండలిని కార్మిక సంఘాలతో ఏర్పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి. సాయి శేషగిరిరావు, జోన్ కన్వీనర్ అశోక్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బాలు సోమేష్, మహమూద్, యాదగిరి, మౌలాలి గౌడ్, వెంకటేష్, అలీఖాన్, సయ్యద్, లక్ష్మమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.